సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 23 । మే । 2023



అన్ని రంగాల్లో అభివృద్ధి

పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు.

- 8లో▸



వీసీ పాలన గాడిన పడినట్లేనా?

కేయూలో వీసీ రమేశ్ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కారం కాగా మరికొన్ని అలాగే ఉండిపోయాయి. వీసీగా బాధ్యతలు చేపట్టి నేటితో రెండేళ్లు పూర్తి చేసుకున్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

42.3^0 / 27.3^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు తీవ్ర వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

రైతు కడుపు‘మంట’

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం
- కటింగ్ పేరిట నిర్వాహకులు, మిల్లర్ల దోపిడీ
- ఓపిక నశించి ధాన్యానికి నిప్పు పెడుతున్న రైతులు
- రోడ్లపై ఆందోళనలు, రాస్తారోకోలు
- పెద్దనాగారం, మానుకోట, నెల్లికుదురులో ఘటనలు
- ప్రజాప్రతినిధుల అడ్డగింత



మానుకోటలో ఆందోళన చేస్తున్న రైతులు



ధాన్యం బస్తాకు నిప్పు పెట్టి రైతుల నిరసన

సాక్షి, మహబూబాబాద్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం కాంటాలు పెట్టడం లేదు. కాంటాలు పెట్టిన ధాన్యం ఎగుమతికి లారీలు దొరకడం లేదు. అన్ని ఇబ్బందులు దాటి మిల్లులకు ధాన్యం తీసుకెళ్లినా దిగుమతి చేసుకునే నాథుడే లేడు. చివరికి తాలు, తరుగు పేరిట డబ్బులు వసూళ్లు చేస్తూ దిగుమతి చేసుకుంటున్నారు. ఇలా అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్న రైతులు కడుపు మండి తాము పండించిన పంటకు నిప్పుపెట్టి ఆందోళనకు దిగుతున్నారు. రోడ్లపైకి చేరి రాస్తారోకోలు, ధర్నాలు చేస్తున్నారు.

మిల్లర్లు, అధికారుల నిర్లక్ష్యం..

రైతులతో మిల్లర్లు, అధికారులు ఆటలాడుకుంటున్నారు. యాసంగిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు 189సెంటర్లు ప్రారంభించారు. అయితే ఈ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం ఏ మిల్లుకు పంపించాలి.. ఎలా తరలించాలి అనే విషయాలపై ఇప్పటి వరకు అధికారులకు స్పష్టత లేదు. ప్రతీరోజు మిల్లులకు తరలిస్తున్న ధాన్యం, దిగుమతి చేస్తున్న ధాన్యం లెక్కలు లేవనే ఫిర్యాదులు ఉన్నాయి. కొనుగోలు కేంద్రం నుంచి రైతులు ట్రాక్టర్లు, లారీలు ద్వారా తీసుకెళ్లిన ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేసుకోవడం లేదు. రోజుల తరబడి మిల్లు వద్దే రైతులు నిరీక్షిస్తున్నారు. ఇలా కొన్ని మిల్లుల్లో తాలు, తరుగు పేరిట డబ్బులు వసూలు చేయడం, ఎక్కువ తూకం పెట్టడం జరుగుతోంది. ఇలా గతంలో దంతాలపల్లిలో, ఆదివారం రాత్రి పెద్దనాగారం శ్రీశ్రీ మిల్లులో చోటు చేసుకుంది.

మానుకోటలో రైతుల రాస్తారోకో

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ధాన్యం పోటెత్తింది. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు రూ.500 నుంచి రూ.1000 వరకు ధరలు తగ్గించి కొనుగోళ్లు జరిపారు. కాగా ధరలు తగ్గించడంపై రైతుల ఆగ్రహించి మార్కెట్ ఎదుట ఇల్లెందు బైపాస్ రోడ్డుపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కొంత ధాన్యాన్ని రోడ్డుపై పోసి తగులబెట్టారు. మార్కెటింగ్ శాఖ అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించి దోపిడీ చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ వై.సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కాగా ఏఎంసీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ మాట్లాడుతూ.. వ్యాపారులు ధర తక్కువగా పెట్టి ధాన్యం కొనుగోళ్లు జరిపిన విషయంపై విచారణ జరిపిస్తామని తెలిపారు.

ఆగ్రహించి ధాన్యానికి నిప్పు..

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చింది మొదలు అమ్మే వరకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద నిరీక్షించలేక, అధికారులు, సెంటర్ నిర్వాహకులు, మిల్లర్లు అవహేళన చేస్తుంటే తట్టుకోలేక ఆగ్రహించిన అన్నదాతలు ధాన్యానికి నిప్పు పెడుతున్నారు. రెండు రోజులైనా ధాన్యం దిగుమతి చేయడం లేదని పెద్దనాగారం శ్రీశ్రీ రైస్ మిల్లు వద్ద విస్సంపెల్లికి చెందిన రైతు చిన్నాల భాను ప్రకాశ్ ఆదివారం రాత్రి ధాన్యం బస్తాకు నిప్పుపెట్టి నిరసన తెలిపాడు. అదేవిధంగా బయట మార్కెట్లతో పోలిస్తే మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ధర తక్కువ పెడుతున్నారని ఆగ్రహించిన రైతులు సోమవారం రోడ్డుపై ధాన్యం పోసి మంట పెట్టారు. అదేవిధంగా నెల్లికుదురు మండలం నర్సింలగూడం కొనుగోలు కేంద్రంలో కాంటాలు పెట్టడం లేదని ఆగ్రహించిన రైతులు రోడ్డుపై ధర్నా చేశారు. రోడ్డుమీద ధాన్యం పోసి నిప్పు పెట్టి నిరసన తెలిపారు. అలాగే జిల్లాలో ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం, అధికారులను నిలదీయడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

ఎమ్మెల్యేకు నిరసన సెగ

దంతాలపల్లి: మండలంలోని రామవరం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు రైతుల నుంచి నిరసన సెగ తగిలింది. గ్రామంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వస్తున్న ఎమ్మెల్యే కాన్వాయ్‌కి అడ్డుగా రైతులు ధాన్యం బస్తాలు వేసి ఆందోళనకు దిగారు. నెలలు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. మిల్లుల్లో దోపిడీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. ధాన్యం దిగుమతికి డబ్బులు వసూలు చేస్తున్నారని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడి మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఫిర్యాదు చేస్తే డబ్బులు తిరిగి చెల్లించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు బోడకుంట్ల రాములు, బొల్ల వెంకన్న, రాజయ్య, వెంకటరమణ ఉన్నారు.



ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఎదుట అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

న్యూస్‌రీల్

విద్యతోనే జీవితాల్లో వెలుగులు

కలెక్టర్ శశాంక



మహబూబాబాద్: విద్యతోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భాగ్యరెడ్డివర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దళితుల అభివృద్ధి కోసం భాగ్యరెడ్డి వర్మ పాటుపడ్డారని, ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక మార్పు కోసం చాలామంది నాయకులు కృషి చేశారన్నారు. దళితులపై వివక్ష వీడాలని, విద్యతోనే మార్పు సాధ్యమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ రమాదేవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కమిటీ సభ్యుడిగా సక్రు



గార్ల: అఖిల భారత ఆదివాసీ జాతీయ కమిటీ సభ్యుడిగా గార్లకు చెందిన ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సక్రును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్నంలో 8 రాష్ట్రాల ప్రతినిధులతో ఆదివారం జరిగిన సదస్సులో 15 మందితో కూడిన నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సక్రు మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాడుతానని పేర్కొన్నారు. సక్రు ఎంపికపై ఏఐకేఎంఎస్, న్యూడెమోక్రసీ పార్టీ మండల నాయకులు సీహెచ్ గణేష్, మంగీలాల్, మాన్యా, మనోహర్ హర్షం వ్యక్తం చేశారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలోని మండల విద్యా వనరుల కేంద్రంలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్‌పీలు, జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో తాత్కాలికంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఆపరేటర్లు, ఉద్యోగస్తులు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రామారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయికి ఎంపిక



గార్ల(డోర్నకల్): జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు డోర్నకల్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికైంది. సోమవారం డోర్నకల్‌లో మండలస్థాయి ఫుట్‌బాల్ పోటీలను మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న లాంఛనంగా ప్రారంభించారు. మండల స్థాయి పోటీలో గార్ల, సీరోలు, మహబూబాబాద్, డోర్నకల్ మండలాల జట్లు పాల్గొన్నాయి. కాగా డోర్నకల్ జట్టు గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికైంది. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, పీఈటీలు రవికుమార్, విజయ్‌చందర్, గోవర్ధన్, లయన్స్ క్లబ్ ప్రతినిధి విత్తనాల సుధాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులు విధిగా రశీదు తీసుకోవాలి



మరిపెడ: విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతు విధిగా రశీదు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ ఏడీఏ శివానంద్ అన్నారు. మరిపెడలో సోమవారం విత్తన విక్రయ కేంద్రాలతో పాటు పురుగుమందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ శివానంద్ మాట్లాడుతూ.. తనిఖీలో నిల్వ ఉన్న విత్తన ప్యాకెట్లను పరిశీలించామని తెలిపారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. నిషేధిత, నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైఓ వేణుమాధవ్, సీఐ బాలాజీ, మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు, ఏఓ వీరాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్: బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్టప్రకారం పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయం 11 నుంచి 2 గంటల వరకు ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించడానికి అందుబాటులో ఉంటానన్నారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మహబూబాబాద్ అర్బన్: కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించి, రెగ్యులరైజ్ చేసి సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నర్సిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీసవేతనం బేసిక్ పే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మల్లారెడ్డి, యాకూబ్, స్వప్న, మంజుల, శ్రీదేవి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజావాణిలో కలెక్టర్ శశాంక



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పెండింగ్ వినతులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ డేవిడ్ వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన వినతులను సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ వినతులు సైతం పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 92 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంచాలి

నిరుపేద విద్యార్థుల్లో ఉత్తమ విద్యాప్రమాణాలు పెంచేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బెస్ట్ అవైలబుల్ స్కీం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బెస్ట్ అవైలబుల్ స్కీంను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో తొర్రూరు, దంతాలపల్లి, పెద్దవంగర, నర్సింహులపేట వంటి మండలాల్లో ఎస్సీ జనాభా అధికంగా ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉత్తమ ఫలితాలతో రాణించే విద్యార్థులను గుర్తించి స్కీం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రామారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు

మహబూబాబాద్ అర్బన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, కలెక్టర్ శశాంక అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయిలో పాల్గొని జిల్లా కీర్తిని చాటాలన్నారు. యువత క్రీడలపై మక్కువ చూపేందుకు సీఎం కేసీఆర్ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడాకారులు పట్టుదల, క్రమశిక్షణ, ఐకమత్యంతో క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చెన్నయ్య, అదనపు కలెక్టర్ డేవిడ్, జెడ్పీ సీఈఓ రమాదేవి, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి అనిల్ కుమార్, పలు శాఖల అధికారులు సూర్యనారాయణ, సుధాకర్, కుర్షిద్, నరసింహస్వామి, వెంకటరెడ్డి, ఛత్రునాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి, కౌన్సిలర్ చిట్యాల జనార్దన్, ఎంపీడీఓలు రవీందర్, భారతి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు



గుడిసెవాసులతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

నెహ్రూసెంటర్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కురవి రోడ్‌లో ప్రభుత్వ భూముల్లో వేసుకున్న గుడిసెలను సందర్శించి గుడిసెవాసులతో మాట్లాడారు. అనంతరం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పేదలు మూడు నెలలుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని ఉంటున్నారని, అక్రమంగా గుడిసెలను తొలగించడం సరికాదన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రియల్‌స్టేట్ వ్యాపారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం అధికారులతో సర్వే చేయించి గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చేలా కలెక్టర్లను ఆదేశించాలన్నారు. ఖాళీస్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులతో పాటు గుడిసెవాసులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జూన్ ఒకటో తేదీ నుంచి ఇంటి స్థలాల కోసం పోరాటాలు చేపడుతున్నామని తెలిపారు. పేద ప్రజల పక్షాన సీపీఎం పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటుందన్నారు.

స్థలాల కొరత

- రికార్డులకే పరిమితమైన ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు కొరత
- వివాదాలతో కోర్టు కేసుల్లో పలు భూములు
- తలనొప్పిగా మారిన స్థలాల సమస్య



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలాలు దొరకడం లేదు. రికార్డుల్లో మాత్రం వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ఇందులో చాలా వరకు భూములు కబ్జాలకు గురయ్యాయి. కొన్ని భూములు వివాదాలతో కోర్టు కేసుల్లో ఉన్నాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థలాలు దొరక్కపోవడంతో నిధులు మంజూరైనప్పటికీ పనులను ప్రారంభించలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు.

అధికంగా ఇక్కడే..

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వేల ఎకరాల భూమి కబ్జాకు గురైంది. జిల్లా ఏర్పాటు తర్వాత ప్రభుత్వ భూముల అవసరం పడింది. ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాల కేటాయింపు సమయంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల వివరాలు బయటపడ్డాయి.

ఆందోళనలు..

జిల్లా కేంద్రంలోని సాలార్‌తండా శివారులో కలెక్టరేట్ నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించగా చాలా సమస్యలు వచ్చాయి. గిరిజన రైతులు ఆందోళనకు దిగారు. సమస్య కోర్టు వరకు వెళ్లగా.. ప్రభుత్వ భూమి అయినప్పటికీ గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఘటనతో చాలా వరకు ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు వెల్లడైంది. ఎట్టకేలకు కలెక్టరేట్ నిర్మాణం పూర్తయి పరిపాలన కొనసాగుతోంది. అలాగే మెడికల్ కాలేజీ విషయంలోనూ చాలా సమస్యలు వచ్చాయి. గిరిజన రైతులు ఆందోళనకు దిగి కోర్టు మెట్లు ఎక్కారు. ఇలా చాలా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు స్థలాల కొరత ఏర్పడింది. చివరికి జిల్లా కేంద్రంలోని చెరువులు సైతం సగానికి పైగా కబ్జాకు గురయ్యాయి.

కదలని పనులు..


- ఇటీవల జిల్లాలో పర్యటించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఇల్లెందు రోడ్డులో సుమారు 48 ఎకరాల స్థలం కేటాయించినట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి హద్దులు ఏర్పాటు చేయలేదు. ఇదిలా ఉండగా ఈ భూమి తమదేనని, పట్టాలు సైతం ఉన్నాయని కొంత మంది రైతులు చెబుతున్నారు. కాగా కళాశాల నిర్మాణ పనుల్లో ఎన్ని అడ్డంకులు ఎదురవుతాయో వేచిచూడాల్సిందే.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..

ప్రభుత్వ భూములు, గ్రీన్‌ల్యాండ్‌లు, చెరువు శిఖం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. బంధం చెరువుతో పాటు మిగిలిన చెరువులకు హద్దుల కేటాయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించినా నేటి వరకు అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

- జిల్లాకు భూసార పరీక్షల కేంద్రం మంజూరై నెలలు గడుస్తున్నా నేటి వరకు స్థలం కేటాయించలేదు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ సమీపంలో ఎకరం భూమి కేటాయించినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్ చెబుతున్నా.. ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్ మాత్రం నేటికీ స్థలం కేటాయించలేదని అంటున్నారు. పనుల టెండర్ పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా.. స్థలం మాత్రం కేటాయించడం లేదు.
- కురవి రోడ్డులో సబ్‌స్టేషన్ కోసం రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. అయితే ఆ స్థలం తమదేనని గిరిజన రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. రైతులు అడ్డుకోవడంతో పనులను మధ్యలోనే నిలిపివేశారు.
- అనంతారం రోడ్డులో మున్సిపాలిటీ భవన నిర్మాణ పనులు జరుగుతుండగా ఆ భూమి తమదేనని దళితులు కోర్టులో కేసు వేశారు. దీంతో కొన్ని నెలలు పాటు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.
- కొన్ని చోట్ల ప్రభుత్వ భూమిల్లో పలు పార్టీల ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. అధికారులు ఆ గుడిసెలను తొలగిస్తుంటే మళ్లీ వేస్తున్నారు. ఇలా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూములన్నీ వివాదాల్లోనే ఉన్నాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాల పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం, మక్కలు



మార్కెట్‌కు వచ్చిన ధాన్యం, మక్కల రాశులు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ధాన్యం, మక్కలు పోటెత్తాయి. ఈ సీజన్‌లో అధికంగా 36 వేలకు పైగా ధాన్యం, మక్కల బస్తాలు అమ్మకానికి రావడంతో షెడ్లు, ఓపెన్‌యార్డులు నిండిపోయాయి. అత్యధికంగా వ్యవసాయోత్పత్తులు రావడంతో వ్యాపారులు టెండర్లు ఆలస్యంగా వేశారు. మొత్తం 19,907 బస్తాల మక్కలు, 16,316 బస్తాల ధాన్యం రాగా, రాత్రి వరకు ఎగుమతులు జరిగాయి. ఈ మేరకు మిగిలిన రాశుల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ధాన్యం క్వింటాకు గరిష్ట ధర రూ.2,151, కనిష్ట ధర రూ.1,419 పలుకగా, మక్కలకు గరిష్ట ధర రూ.1,763, కనిష్ట ధర రూ.1,209 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు చైర్‌పర్సన్ సుహాసినిదుర్గేష్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పెద్దమంగ్యాతండాలో అధికారులు

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఈజీఎస్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ రాజారావు అన్నారు. సోమవారం మండలంలోని వెలికట్ట, పెద్దమంగ్యాతండాల్లో జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్‌తో కలిసి పర్యటించారు. గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, నర్సరీలు, మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలం సీజన్‌లో ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ఎంపీడీఓ సింగారపు కుమార్, ఎంపీఓ గౌస్, ఏపీఓ పార్థసారథి, సర్పంచ్‌లు పుష్పలీల, శారదరమేష్ పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ ఎస్సై విజయరాంకుమార్ సోమవారం రాత్రి తెలిపారు. బాధితురాలు మాదాసు రమణ (భర్త చిన్న వెంకన్న లేటు) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ప్రాంతానికి చెందిన మాదాసు రమణ తన భూమిలో కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలుసుకుంది. ఈ క్రమంలో ఈనెల నాలుగో తేదీన ఆమెతోపాటు కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. కాటా భాస్కర్, బోళ్ల రాకేష్ రెడ్డి, బత్తుల నరసింహారావు, బంకు శీను అనే వ్యక్తులు ఆ భూమితో సంబంధం లేని వ్యక్తులతో సంఘటన స్థలానికి వచ్చారు. రమణపై చేయి చేసుకోవడమే కాకుండా కులం పేరుతో దూషించారు. కాగాబాధితురాలి ఫిర్యాదుతో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న మాజీ మావోయిస్టు మృతి


శివాజీ (ఫైల్)

ఎంజీఎం: మాజీ మావోయిస్టు సూతి శివాజీ (72) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. శుక్రవారం అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఎంజీఎంలో అడ్మిట్ చేశారు. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన శివాజీ వరంగల్ ఆర్ఈసీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఆ తర్వాత పీపుల్స్‌వార్ దళంలో చేరాడు. ఆర్ఎస్‌యూ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించాడు. పీపుల్స్ వార్ నేత కొండపల్లికి సహచరుడు. గెరిల్లా దళాలను ఏర్పాటు చేయడంలో దిట్ట. గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారితో పనిచేశాడు. 1990 నుంచి 97 వరకు జైలు జీవితాన్ని గడిపి బయటకు వచ్చాడు. ప్రస్తుతం ఆయన నగరంలోని 22వ డివిజన్ మర్రివెంకటయ్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. శివాజీ మృతదేహాన్ని వైద్య విద్యార్థుల విద్యాబోధన కోసం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించనున్నట్లు ఆయన కూతురు అమని, కుటుంబ సభ్యులు తెలిపారు.

వాగులో గల్లంతై వృద్ధుడు..


ఉప్పలయ్య(ఫైల్)

నర్సంపేట రూరల్: వాగులో గల్లంతై మండలంలోని మాధన్నపేట గ్రామానికి చెందిన బొల్లేని ఉప్పలయ్య(70) సోమవారం మృతి చెందాడు. ఉప్పలయ్యకు గ్రామ శివారులో, వాగు సమీపంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో వరి సాగు చేశాడు. ధాన్యం కోసి ఆరబోయగా.. ప్రతీ రోజు తన గేదెను తీసుకోని వ్యవసాయ భూమి వద్ద మేపుకుని సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేవాడు. ఎప్పటిలాగే.. సోమవారం ఉదయం ఉప్పలయ్య తన గేదెను తీసుకుని ఉదయమే ఇంటి నుంచి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో మధ్యాహ్నం వాగులోకి వెళ్లిన గేదెను తీసుకొచ్చేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. సాయంత్రం 7 గంటల సమయంలో గేదె మాత్రమే ఇంటికి రావడంతో కుటుంబీకులు వాగువద్దకు వెళ్లి చూడగా.. ఉప్పలయ్య తువాలు, చెప్పులు కనిపించాయి. స్థానిక సర్పంచ్ మొల్గూరి చంద్రమౌళి, గ్రామస్తులు గజఈతగాళ్ల సాయంతో వాగులో గాలించగా.. ఉప్పలయ్య మృతదేహం లభ్యమైంది.

వీసీ పాలన గాడిన పడినట్లేనా?


మహిళా హాస్టల్ నూతన భవనం ఇదే..


కేయూలో నిర్మిస్తున్న కె హబ్ భవనం

- ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్ వసతి తొలగింపు
- సదుపాయాలు.. అభివృద్ధి పనులు
- అడ్జెంట్ ప్రొఫెసర్ల నియామకాలు
- అధ్యాపకులకు పదోన్నతులు
- న్యాక్ 'ఏ' గ్రేడ్ నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు
- నేటితో కేయూ వీసీ పాలనకు రెండేళ్లు


వీసీ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్: కేయూలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కారమయ్యాయి. మరికొన్ని అలాగే ఉండిపోయాయి. వీసీగా రమేశ్ పాలన పగ్గాలు చేపట్టి ఈనెల 23తో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్నారు. రెండేళ్ల పాలన కొంత ఖేదం, మరికొంత మోదం అన్నట్లుగా కనిపిస్తోంది. యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత వేధిస్తూనే ఉంది. వీసీగా బాధ్యతలను చేపట్టినప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలే కీలకంగా అందించేలా కృషి చేస్తానని వీసీ చెప్పినప్పటికీ ఇంకా ఆదిశగా అడుగులు వేయడం లేదని చెప్పవచ్చు. కొన్నివిభాగాల్లో తరగతులు అంతంత మాత్రమే కొనసాగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఒకసారి స్నాతకోత్సవం కూడా నిర్వహించారు.

న్యాక్ సన్నద్ధానికే సమయం

వీసీ కొన్ని నెలలుగా న్యాక్ సన్నద్ధం కోసం సమయం వెచ్చిస్తూ అధ్యాపకులనూ ఆదిశగానే నడిపిస్తూ వస్తున్నారు. వర్సిటీలో విద్యార్థులు వివిధ సమస్యలపై తరచూ ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. రెండేళ్లయినా పాలన ఇంకా గాడిన పడినట్లేనా? అంటే భిన్నాభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. పలు అంశాల్లో వీసీ రమేశ్ అనేక విమర్శలు కూడా ఎదుర్కొంటున్నారు. పలు అపరిష్కృత సమస్యలున్నాయి. అయినా.. ఎవ్వరినీ పట్టించుకోకుండా తాను అనుకున్నదే చేస్తూ తన మార్క్‌తోనే పాలన కొనసాగిస్తున్నారు.

నాన్చుడు ధోరణి..

బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వివిధ సమస్యల పరిష్కారంలో నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారనే విమర్శల్ని వీసీ ఎదుర్కొంటున్నారు. విద్యా బోధనపై పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా వీసీ లాడ్జ్ నుంచే పాలన కొనసాగిస్తున్నారు. పరిపాలన భవనంలో తన చాంబర్‌కు అప్పుడప్పుడు మాత్రమే వస్తుండడం కూడా విమర్శలకు తావిస్తోంది.

హాస్టల్ వసతి తొలగింపు..

వీసీ కేయూలో ఎస్ఎఫ్‌సీ సీట్లను పెంచారు. ఈవిద్యాసంవత్సరంలో ఆయా ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టల్ వసతి తొలగించి హాస్టల్ అడ్మిషన్లు కల్పించలేదు. దీంతో ఎస్ఎఫ్‌సీ విద్యార్థులు ఆందోళనలు చేశారు. ఆందోళనలు చేసే వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులపై కేసులు పెట్టడం కూడా విమర్శలకు తావిస్తోంది. క్యాంపస్‌లోని పోతన బాయ్స్ హాస్టల్‌లోని విద్యార్థులను న్యూపీజీ బాయ్స్ హాస్టల్‌కు పంపించారు. పోతన హాస్టల్‌లో ఇకపై విద్యార్థినులకు వసతి కల్పించనున్నారు.

నియామకాల్లేవు..

కేయూలో దశాబ్దకాలంగా అధ్యాపకుల నియామకం లేదు. 136 పోస్టులు మంజూరైనా భర్తీకి చర్యలు చేపట్టట్లేదు. రెగ్యూలర్ అధ్యాపకులు 100 మంది వరకే ఉన్నారు. అడ్జెంట్ ఆచార్యులను 12 మందిని నియమించారు. మరో నలుగురికి ఈసీ అప్రూవల్ తీసుకున్నారు. అయితే వీరి నియామకం నిబంధనల మేరకు కాకుండా.. ఇష్టం వచ్చినవారినే నియమించుకుంటున్నట్లు పెద్దెత్తున విమర్శలు వస్తున్నాయి. పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో జాప్యం చేస్తున్నారు.

'నాన్ టీచింగ్' సమస్యల పరిష్కారమేది?

కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. అయితే అకుట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌కు సీనియర్ ప్రొఫెసర్‌గాను, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారికి ప్రొఫెసర్‌గా పదోన్నతులు కల్పించలేదు. దీంతో వీసీపై వారు ఆరోపణలు చేశారు. పలువురు అధ్యాపకులపై వీసీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. నాన్ టీచింగ్ రెగ్యూలర్, తాత్కాలిక ఉద్యోగుల సమస్యలూ అపరిష్కృతంగా ఉన్నాయి. 73 మంది రెగ్యులర్ ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వాల్సి ఉంది. తాత్కాలిక ఉద్యోగులకు 30 శాతం వేతనాలు పెంచాలి. ఏది అడిగినా న్యాక్ తర్వాతే అని చెప్పడం గమనార్హం.

మౌలిక సదుపాయాలు.. అభివృద్ధి

- రూ.7 కోట్లతో మహిళా వసతి గహ నిర్మాణం పూర్తి
- కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ కోసం నిర్మించిన భవనంలో ఏర్పాటు చేయనున్న పీవీ విజ్ఞాన పీఠం
- పరిపాలన భవనంలో సెకండ్ ఫ్లోర్ నిర్మాణం
- దూర విద్యా కేంద్రంలో ఆడియో-వీడియో డిజిటల్ తరగతుల పునరుద్ధరణ
- న్యూ పీజీ బాయ్స్ హాస్టల్‌లో డైనింగ్ హాల్
- పరీక్షా విభాగం ప్రాంగణంలో మహిళా వాష్‌రూమ్
- రూ.కోటితో పరిపాలనా భవనం నుంచి దూర విద్య కేంద్రం వరకు సీసీ రోడ్డు నిర్మాణం
- క్యాంపస్‌లోని ఓ చోట చెక్ డ్యామ్ అభివృద్ధి
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సౌజన్యంతో రూ 9.20 లక్షల వ్యయంతో మహిళా హాస్టల్ ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- కేయూలో స్పోర్ట్స్ బోర్డ్‌లో ఉన్న జిమ్ ఆధునికీకరణ
- రూ. 6 కోట్ల వ్యయంతో క్యాంపస్‌లో చివరిదశలో కె హబ్ భవన నిర్మాణం
- విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేలా 34 ప్రతిష్టాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు
- న్యాక్ 'ఏ' గ్రేడ్‌ను నిలబెట్టుకోవాలని వీసీ సుమారు రూ.10 కోట్లకు పైగా వివిధ అభివృద్ధి, మరమ్మతుల పనులు బ్యూటిఫికేషన్‌ను చేయిస్తున్నారు. ఈపనులు పూర్తి కావొస్తున్నాయి.

అన్ని రంగాల్లో అభివృద్ధి


సింగరాజుపల్లి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి ఎర్రబెల్లి

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిద్దుతున్నట్లు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల పరిధి పడమటితండా(పెద్దతండా), సింగరాజుపల్లి క్లస్టర్లలో తీగల దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభల్లో ఆయన మాట్లాడారు. నాడు ప్రజారంజక పాలనకు ఎన్టీఆర్ బీజాలు వేయగా.. నేడు కేసీఆర్ ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రజల మన్ననలు పొందుతున్నాడని పేర్కొన్నారు. ఎడారిలా కనిపించే ఈ ప్రాంతానికి సాగు, తాగు నీరు అందించి సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. కుటుంబ ఆర్థికాభివృద్ధిలో కీలకమైన మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరల కారణంగా ప్రజలపై పెనుభారం పడుతోందని, 70 ఏళ్ల పాలనలో ఉన్న పార్టీలు చేసిన అభివృద్ధి శూన్యమని, ఇందుకు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య నిదర్శనంగా నిలిచారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల అర్థరహిత విమర్శలు తిప్పికొడుతూ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న బీఆర్ఎస్‌ను బలపర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, జెడ్పీటీసీ పల్ల భార్గవిసుంద్‌రామిరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, సర్పంచ్‌లు కోక్యా, మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అట్టహాసంగా ముగిసిన 'యువ సంఘం'


యువ సంఘం ముగింపు కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, విద్యార్థులు

కాజీపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏక్‌భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన యువ సంఘం కార్యక్రమం సోమవారం నిట్‌లో అట్టహాసంగా ముగిసింది. సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరానికి తెలిపేందుకు ఉత్తరాఖాండ్‌కు నిట్ వరంగల్ విద్యార్థులు, నిట్ వరంగల్‌కు ఉత్తరాఖాండ్ ఐఐటీ రూర్కేలాకు చెందిన 45 మంది విచ్చేసి సంస్కృతీ సంప్రదాయాలపై వారం రోజులు అధ్యయనం చేశారు. నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన యువ సంఘం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. దేశవ్యాప్త సంస్కృతీ సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించేందుకు వేదికగా యువ సంఘం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉత్తరాఖాండ్‌కు చెందిన విద్యార్థులు నగరంతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాలను సందర్శించి, గ్రామీణ ప్రాంతాల్లోని జీవన శైలిని, వ్యవసాయాన్ని, యాస, భాషలపై అధ్యయనం చేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో యువ సంఘం నోడల్ ఆఫీసర్లు సునీల్‌కృష్ణ, శ్రీనివాస్, విద్యార్థులున్నారు.


ఉత్తరాఖండ్ విద్యార్థులతో నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

విద్యార్థులతో కలిసి గవర్నర్ నృత్యం

'యువ సంఘం'లో ఆదివారం ఉత్తరాఖాండ్‌కు చెందిన విద్యార్థుల బృందం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆతిథ్యాన్ని స్వీకరించేందుకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తరాఖండ్ సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థులు వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కల్చరల్ ఫెస్ట్‌లో ఉత్తరాఖండ్ విద్యార్థులతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆనందంగా నృత్యం చేశారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు వైఎస్.రెడ్డి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్ట్


నిందితుడికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న వర్ధన్నపేట సీఐ

వరంగల్ క్రైం: గంజాయి స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న మహారాష్ట్ర మాలేగావ్ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ అలియాస్ యాకూబ్‌పై సీపీ జారీ చేసిన ఉత్తర్వులను సోమవారం వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీ.సదన్‌కుమార్ నిందితుడికి చర్లపల్లి జైలులో అందించారు. యాకూబ్ గతేడాది నవంబర్ 19న మరో ఐదుగురితో కలిసి ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తున్న క్రమంలో జాఫర్‌గఢ్ పోలీసులు ఈముఠాను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.10 లక్షల విలువైన వంద కిలోల గంజాయి, రెండు కార్లు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకొని జైలుకు తరలించారు.

ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ.80 వేల నగదు స్వాధీనం
- నాలుగు ఫోన్లు సీజ్


బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

రామన్నపేట: డాఫాబెట్ యాప్ ద్వారా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు చెందిన చింతం సాయికుమార్, చింతం కపిల్, శంభునిపేటకు చెందిన పస్తం వినోద్‌కుమార్, రంగశాయిపేటకు చెందిన గట్టు దర్శనం డాఫాబెట్ యాప్ ద్వారా ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈనలుగురిని కాశిబుగ్గ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.80 వేల నగదు, నాలుగు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌లు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శరత్, లవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్

బయ్యారం: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగను సోమవారం బయ్యారం పోలీసులు అరెస్ట్ చేశారు. గార్ల-బయ్యారం సీఐ బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన పూనెం రాజు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. బయ్యారం పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు కామేపల్లి, ఇల్లందు, చుంచుపల్లి, ఏన్కూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజు పలు చోరీలకు పాల్పడగా కేసులు నమోదయ్యాయి. 2022 డిసెంబర్‌లో బయ్యారం స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాల్లో రాజును అరెస్ట్ చేసి జైలుకు పంపగా.. జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈసమాచారం మేరకు రాజును అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.5.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాలాజీ తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


శ్యామ్ (ఫైల్)

తొర్రూరు: ప్రేమ విఫలమై తొర్రూరులోని చర్చి బజారుకు చెందిన అల్లం శ్యామ్ (26) ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్యామ్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఓ యువతిని ప్రేమించాడు. ఆమె తిరస్కరించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి పస్తం స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అనాథ పిల్లలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే


పిల్లలతో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: అనాథలైన పిల్లలకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అండగా నిలిచారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనాథ పిల్లలను పిలిపించుకుని డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు, బట్టలు అందించారు. చిట్యాల మండలం పాశిగడ్డ గ్రామానికి చెందిన భూక్య సురేశ్, వసంత అనారోగ్యంతో మూడేళ్ల క్రితం మరణించడంతో వారి పిల్లలు తిరుపతి, లక్పతి, సంజన, రాజేశ్ అనాథలయ్యారు. ఇటీవలి వర్ష బీభత్సానికి చిన్నారులు నివాసముంటున్న ఇంటి పైకప్పు లేచిపోయింది. ఈదీనస్థితిని స్థానిక నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. సోమవారం పిల్లలను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని తక్షణ సాయం కింద నిత్యవసర సరుకులు, బట్టలు అందించారు. వారు నివాసం ఉండేందుకు భూపాలపల్లిలో రెండు పడకల ఇల్లు ఇస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌కు ఫోన్ ద్వారా పిల్లల పరిస్థితి వివరించి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే.. కలెక్టర్ భవేశ్ మిశ్రాను పిల్లలు కలిశారు. అన్ని విధాలా అండగా ఉంటానని కలెక్టర్ పిల్లలతో అన్నారు. కార్యక్రమంలో చిట్యాల జెడ్పీటీసీ గొర్రె సాగర్, గ్రామ సర్పంచ్ లావుడ్యా రజిత హరిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రితో కలిసి తమ్ముడిపై దాడి

- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి
- ఆస్తి తగాదాలే కారణమంటున్న గ్రామస్తులు


కృష్ణ (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో తండ్రితో కలిసి తమ్ముడిపై దాడి చేయగా మామిడ్ల కృష్ణ (32) సోమవారం మృతి చెందాడు. మామిడ్ల రాములుకు ముగ్గురు కుమారులు. అంజనేయులు, కృష్ణ, మల్లేశం. ముగ్గురికీ వివాహాలై నెల్లుట్లలో ఉంటున్నారు. ఆంజనేయులు, మల్లేశం రైల్వేలో బిల్ల కూలీలుగా పని చేస్తుండగా.. కృష్ణ గ్రామంలోనే ట్రాక్టర్ కొనుక్కొని జీవనోపాధి పొందుతున్నాడు. నెల్లుట్ల బైపాస్ సమీపంలోని బీజేపీ కార్యాలయం పక్కనే తండ్రి రాములు పేరుతో ఉన్న 500 గజాల ప్లాటును ఇటీవలే కృష్ణకు తెలియకుండా తండ్రి, అన్న అంజనేయులు, తమ్ముడు మల్లేశం అమ్ముకున్నారు. విషయం తెలుసుకున్న కృష్ణ ప్లాటు అమ్మిన డబ్బులు తనకు కూడా ఇవ్వాలని వారిని అడిగినట్లు తెలిసింది. దీంతో ఈనెల 19న వీరి మధ్య గొడవ జరిగి కృష్ణను రాములు, ఆంజనేయులు కలిసి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. తలకు తీవ్ర గాయాలైన కృష్ణను హైదరాబాద్‌లోని ఆదిత్య ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈవిషయంపై ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా.. తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఆదిత్య ఆస్పత్రి యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడగా.. మెట్లపై నుంచి పడ్డాడని చెప్పి ఆస్పత్రిలో చేర్పించారని చెప్పారు. ఆస్పత్రికి వెళ్లి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం


వెంకటేశ్ (ఫైల్)

గార్ల: వివాహేతర బంధం కొనసాగిస్తూ, వివాహితను పెళ్లి చేసుకుంటానంటే, తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో గార్లకు చెందిన బాణాల వెంకటేశ్(25) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గార్లలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం బజార్‌కు చెందిన వెంకటేశ్ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో కొంత కాలంగా అదే బజారుకు చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. ఈక్రమంలో వెంకటేశ్ ఆమెనే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పాడు. కానీ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన వెంకటేశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 'ఇంటికి పెద్ద కొడుకువు.. మమ్ముల్ని సాకుతావని ఆశలు పెట్టుకుంటిమి కదరా కొడుకా.. గింతపని చేస్తవనుకోలేదు కొడుకా' అంటూ తల్లితండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి శ్రీనివాసాచారి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకున్నట్లు గార్ల ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న వోపాస్ అధ్యక్షులు విద్యాసాగర్

హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వోపాస్ ప్రతిభా పురస్కారాలు, నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు వరంగల్ జిల్లా విశ్వ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం (వోపాస్) అధ్యక్షుడు సిద్దోజు విద్యాసాగర్ తెలిపారు. సోమవారం సుబేదారిలోని సంఘం కోశాధికారి వలబోజు కేశవరావు గృహంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జూన్ 25వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91541 02640, 95026 78767 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యవస్థాపకులు కట్టా సత్యనారాయణచారి, డాక్టర్ అనసూరి చంద్రమౌళి, సభ్యులు గురుబ్రహ్మం, వేల్పుల దేవాచారి, సదానందచారి, శ్రీపాద సుధాకర్‌రావు, రాజ్‌కుమార్, దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వంశీకృష్ణ, రాకేశ్


వంశీకృష్ణ


రాకేశ్

కమలాపూర్: ఉమ్మడి వరంగల్ జిల్లా ఫిజియోథెరపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ సిరికొండ వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ గుండు రాకేశ్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికల్లో వంశీకృష్ణ ప్యానల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వొడితెల రాము తెలిపారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ చిరంజీవి, కార్యదర్శులుగా రామకృష్ణ, శైలజ, ప్రధాన కార్యదర్శులుగా మోసిన్, సుకుమార్, రఘుపతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కమలాకర్, సామ్రాట్, హరీశ్, కోశాధికారిగా వొడితెల రాము, మహిళా కో-ఆర్డినేటర్లు కృపాశాలిని, ప్రసన్న, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా సునీల్ కిరణ్, శివరామకృష్ణ, హేమంత్‌రాజ్, క్రాంతిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

పిడుగుపాటుతో మూగజీవాల మృత్యువాత


ఆవు వద్ద విలపిస్తున్న రైతు సిద్ధులు

నర్మెట: మండలంలోని ఇప్పలగడ్డలో సోమవారం తెల్లవారు జామున పిడుగుపడి రైతు గరిగె వీరస్వామికి చెందిన ఆవు, దూడ మృతి చెందాయి. రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లింది. బొమ్మకూరులోని రావుల మల్లయ్య కొనుగోలు చేసిన ఒంగోలు జాతి మేలు రకం కాడెద్లు రెండు పిడుగుపాటుతో మృతి చెందాయి. రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది.

ఉస్తేనుగూడెంలో మరో ఆవు..

జనగామ రూరల్: మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామ పరిధి ఉస్తేనుగూడేనికి చెందిన ఉస్తేపు సిద్ధులుకు చెందిన ఆవుపై సోమవారం తెల్లవారు జామున పిడుగుపడింది. రైతు ఎప్పటిలాగే తన వ్యవసాయ బావి వద్ద ఆవును ఉంచి ఇంటికి వెళ్లగా.. ఉదయం పడిన పిడుగుపాటుతో తన రూ.65 వేల విలువైన ఆవు మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.